క్లుప్తంగా

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



జనగామ రూరల్: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ గ్రామానికి చెందిన కావేటి సిద్ధులు మెడ నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా, కిరణ్‌కుమార్ వెంటనే సిద్ధులు పరిస్థితిని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించిన రూ.1,75 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. దీంతో బుధవారం బాధితుడికి ఆస్పత్రిలో కిరణ్‌కుమార్ ఎల్‌ఓసీని అందజేశారు. చౌడారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కూకట్ల చంద్రమౌళి యాదవ్, యూత్ నాయకులు జయా మల్లేష్, ఉదయ్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి




బచ్చన్నపేట: పది తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం పదోతరగతి విద్యార్థులకు సాయిలక్ష్మి శ్రీనివాస్ సహకారంతో రాజమాత ఫౌండేషన్ సౌజన్యంతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ వెంకట్‌రెడ్డి, ఎస్సై ఎస్‌కే హమీద్, రాజమాత ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌రెడి పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం



చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో మెడికవర్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్, వినాయకయూత్ అసోసియేషన్ వారి సహకారంతో ఆకుల సాయికిరణ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 1,200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ శిబిరంలో ఈసీజీ, టుడి ఎకో తదితర ఖరీదైన పరీక్షలు నిర్వహించడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు. మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్టు ఎండీ.షఫీ, గిరీష్, కన్సల్టెంట్ డాక్టర్లు, ఎంపీఓ, చిన్నపెండ్యాల స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్, హెచ్‌ఎం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రం



వేలాడుతున్న ట్యూబ్ లైట్ ఫ్రేమ్‌లు



మండల కేంద్రంలో అపరిశుభ్రంగా ఉన్న రైతువేదిక

- నిర్వహణ లోపంతో చెత్తాచెదారంతో నిండిన రైతు వేదికలు

తరిగొప్పుల: వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. నిర్వహణ లోపంతో రైతు వేదిక సమావేశ ప్రాంగణం దుమ్ముధూళితో, పరిసరాలు చెత్తచెదారంతో అపరిశుభ్రంగా మారాయి. విద్యుత్ దీపాలు ఊడిపోయి వేలాడుతూ కనిపిస్తున్నాయి. కనీస నీటి వసతి సదుపాయం లేకపోవడంతో సమావేశాలకు వచ్చే అధికారులు, రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మండల వ్యాప్తంగా మూడు రైతు వేదికలు ఉన్నప్పటికీ ఏ ఒక్కదానికి నీటి వసతి లేదు. దీంతో మరుగుదొడ్ల నిర్వహణ లేక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యవసాయ విస్తరణాధికారుల్లో మహిళలే ఉన్నారు. విధి నిర్వహణలో ఒంటికి, రెండికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. భవనాలకు ప్రహరీ లేకపోడంతో భద్రత కరువైంది. దీంతో ఆవరణలో పశువుల సంచారం, చెత్తాచెదారం, ఆకతాయిల ఆగడాలతో అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. నిధుల లేమితో రైతు వేదికల నిర్వహణ భారంగా మారిందని మహిళా ఏఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల లేమితో నిర్వహణ భారంగా మారింది

రైతు వేదికలు ఏర్పాటు చేసిన మొదట్లో నిర్వహణకు నిధులు కేటాయించారు. ఇప్పుడు ఆ నిధులు రావడంలేదు. నిధులలేమితోనే రైతు వేదిక నిర్వహణ భారంగా మారింది.

– మన్మోహిత్ విక్రంరావు, ఏఓ

జనగామను సర్వాయి పాపన్న జిల్లాగా మార్చాలి

- జీఐఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు తండ రమేశ్

దేవరుప్పుల/పాలకుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జనగామను సర్వాయి పాపన్న జిల్లా మార్చాలని గౌడ ఐక్య సాధన సమితి జిల్లా అధ్యక్షుడు తండ రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం దేవరుప్పుల, పాలకుర్తి మండల కేంద్రాల్లో శుక్రవారం జనగామలో తలపెట్టిన దీక్ష కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. పొడిశెట్టి వెంకన్న, బూడిద ప్రశాంత్ గౌడ్, మొలుగురి సోమనర్సయ్య, కారుపోతుల మల్లయ్య పాల్గొన్నారు.

రఘునాథపల్లి: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు నామకరణం చేయాలని మాజీ వైస్ ఎంపీపీ, గౌడ సంఘం జిల్లా నాయకుడు మల్కపురం లక్ష్మయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాపన్న జిల్లా సాధన కోసం ఈ నెల 21న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న దీక్ష వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో గౌడ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిగౌడ్, గైని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జీఐఎస్ఎస్ నాయకులు

దీక్షను విజయవంతం చేయండి

నర్మెట: జనగామ జిల్లాకు పోరాట బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న పేరును పెట్టాలని పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం మండల అధ్యక్షుడు గుండేటి రాంచందర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం చౌరస్తాలో శుక్రవారం తలపెట్టిన ఒక్క రోజు నిరాహార దీక్షకు గౌడ కులస్తులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో సంబురాలు



నర్మెట: సంబురాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

నర్మెట/తరిగొప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మంగళవారం అసెంబ్లీ ఆమోదముద్ర వేసిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నర్మెట, తరిగొప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండల కేంద్రాల్లో బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, బాణాసంచాపేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మాపెస్, ఎమ్మెస్పీ, దాని అనుబంధ సంఘాల నాయకులు చుంచు రాజు, గద్దల కిషోర్, కొంపెల్లి అంబేడ్కర్, కంతి చరణ్, బిచ్చాల వంశి, గుర్రం నవీన్, గాదె శ్రీధర్, ముత్యాల సంపత్, ఆరూరి శ్రీనివాస్, పడమటింటి నర్సింహ, గువ్వల ఎల్లయ్య, భువనగిరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం



పాలకుర్తిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

పాలకుర్తిటౌన్/కొడకండ్ల/దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మకమని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై కొడకండ్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, భిక్షపతి, రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీలకు 42శాతం రిజర్వేషన్ చట్టసభల మద్దతుపై హర్షం వ్యక్తం చేస్తూ దేవరుప్పులలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాడబోయిన గణేశ్ ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఉప్పల సురేష్‌బాబు, పారుపెల్లి శ్రీనివాస్, పాండు కృష్ణ, ఓడపల్లి రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

స్టేషన్‌ఘన్‌పూర్: అన్ని సామాజిక వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకుడు, శివునిపల్లి మాజీ ఎంపీటీసీ గుర్రం ఫాతికుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు, బీసీ రిజర్వేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వంలో అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఫ్లెక్సీలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద క్షీరాభిషేకం చేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం

ఎస్సీల వర్గీకరణ చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్ అన్నారు. ఎస్సీల వర్గీకరణ బిల్లు శాసనసభలో ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఘన్‌పూర్‌లో సంబురాలు జరుపుకున్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, సింగపురం ఇందిర, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ కోర్సుల్లో శిక్షణ

జనగామ రూరల్: వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిరుద్యోగ బీసీ యువతీ యువకులకు డ్రైవింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ, లైట్‌వెహికిల్ శిక్షణ 38 రోజులు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ బీ.సీ యువతీ యువకులు, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు దరఖాస్తులను జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఈనెల 31వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

జఫర్‌గఢ్/తరిగొప్పుల/పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: తమ్మడపల్లి(జీ), మాధాపురం, పాలకుర్తి, తరిగొప్పుల ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, హెచ్‌ఎంలు మాట్లాడుతూ పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎంలు సీతారామయ్య, రమేశ్, బానోత్ రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యంలో ప్రత్యేకతను చాటాలి

జనగామ రూరల్: సమాజ చైతన్యంలో బంజారా ఉద్యోగులు ప్రత్యేకతను చాటాలని జనగామ ఆర్డీఓ గోపిరామ్ అన్నారు. బుధవారం జనగామ ఆర్డీఓ కార్యాలయంలో తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం డైరీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బానోత్ దస్రునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. బంజారాలు ఎన్నో కష్టాలను అధిగమించి, ఉద్యోగులుగా స్థిరపడి, సంఘటితమై సామాజిక దృక్పథంతో తమవంతు సేవ చేయాలని అన్నారు. డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, మాజీ కౌన్సిలర్ అనిత, కాల్ రామ్, హరిలాల్ ధర్మభిక్షం, బికోజీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య మల్లేష్ కోశాధికారి అజ్మీరా రవి పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి

దేవరుప్పుల: ఈనెల 21వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం.మహిపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంతోపాటు కామారెడ్డిగూడెం, చిన్నమడూరులో పదో తరగతి వార్షిక పరీక్షల కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం సందర్శించారు. కావాల్సిన వసతుల్లో తేడాలేకుండా సంబంధిత శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు.

ఏర్పాట్లు పూర్తి

స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం: ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు స్టేషన్‌ఘన్‌పూర్, లింగాలఘణపురం మండలాల్లోని పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు కొమురయ్య, విష్ణుమూర్తి తెలిపారు. బుధవారం వారు వేర్వేరుగా పలు పరీక్ష సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసుకొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

‘వర్గీకరణ బిల్లు ఆమోదం హర్షణీయం’

రఘునాథపల్లి: శాసనసభ, శాసన మండలిలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లును ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయమని జనగామ వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ ముసిపట్ల విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మాదిగల ఆర్థిక స్థితిగతులపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా మాజీ సీఎం కేసీఆర్ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు.

పోరాట యోధుడు ఠాణూనాయక్



నివాళులర్పిస్తున్న బీహెచ్‌పీఎస్ నాయకులు

పాలకుర్తి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాణూనాయక్ అని బంజారా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బంజారా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఠాణూనాయక్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధరావత్ రాంసింగ్, లకావత్ వెంకట నాయక్, లకావత్ నాగరాజు, సురేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, భూక్య ఆంజనేయులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యానికి ఘన నివాళి



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న షబానా తదితరులు

జఫర్‌గఢ్/పాలకుర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో జఫర్‌గఢ్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా, ఎం.శోభ, కవిత, కోమల, భారతమ్మ, లక్ష్మి, రజిత, సునీత తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో మల్లు స్వరాజయ్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ సదర్భంగా ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, సోమ సత్యం తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



క్రీడాకారుల వందనం స్వీకరిస్తున్న తహసీల్దార్

బచ్చన్నపేట: విద్యార్థులు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆన్యువల్ స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పది పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. మొదట క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి, ఎస్సై ఎస్‌కే హమీద్, పాఠశాల ప్రిన్సిపల్ భారతిదేవి , ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పీఈటీ శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే సృజనాత్మకత పరిజ్ఞానం



అవగాహన కార్యక్రమంలో పోలీసు అధికారులు

దేవరుప్పుల: సాంకేతిక పరిజ్ఞానం పెంపొందిన క్రమంలోనూ పుస్తక పఠనంతోనే విద్యార్థులు సృజనాత్మకత పరిజ్ఞానం పొందగలుగుతారని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రశ్నలకు సొంత ఆలోచనలతో రాసినప్పుడే మీలోని పరిజ్ఞానం వెల్లడవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఊర సృజన్‌కుమార్, పాఠశాల కరస్పాండెంటు టి పాండుకృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘అసత్య ఆరోపణలు సరికాదు’

పాలకుర్తిటౌన్: రెవెన్యూ శాఖకు మచ్చ తెచ్చేలా పలువురు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని పాలకుర్తి తహసీల్దారు శ్రీనివాస్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో రెవెన్యూ శాఖపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ తాను ఏసీబీ ట్రాప్‌లో ఉన్నట్లు, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు అభూత కల్పనలతో సోషల్ మీడియాలో అవాస్తవ ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. వాట్సప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టిన వారిని గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలి

జనగామ రూరల్: అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో రాపర్తి రాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అహల్య, యాదగిరి , రమేష్, శేఖర్, సోమయ్య, గోపి, ప్రకాష్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నర్మెట: ఎన్నికల హామీలను ఒకోక్కక్కటిగా అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. సూర్యబండ తండాలో రూ.16 లక్షల ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రారంభించారు. మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, గొల్లపల్లి కుమారస్వామి, ఫరీదుల యాదయ్య, భూక్య జయరాం, వలబోజు శ్రీనివాస్, బాలచందర్, బుర్రా నరేశ్ గౌడ్, శంకర్, హర్సింగ్, చందర్, నరేందర్, మహేందర్, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంద రావొద్దు

బచ్చన్నపేట: వేసవి దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా జీపీ కార్యదర్శులు చూడాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. బుధవారం మండలంలోని ఆలింపూర్ గ్రామంలో జీపీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, పైపులైన్ లీకేజీలకు ఎప్పటికప్పుడు మరమ్మతు చేయించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రేవతి, కారోబార్ మురళి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

‘దాచుకున్న సొమ్మునే అడుగుతున్నాం..’

చిల్పూరు: 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన తాము దాచుకున్న సొమ్మునే అడుగుతున్నామని పెన్షనర్ల పోరాట కమిటీ బాధ్యులు విజేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కొంరెల్లి, భిక్షపతి, లక్ష్మయ్య, మనోహర్, రవీందర్ బుధవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెన్షనర్ల పెండింగ్ బిల్లులు ప్రతీ మాసంలో కొందరికి చొప్పున మూడు నెలల్లో అందరికి చెల్లించి ఆదుకోవాలని కోరారు.

‘కడియంపై రాజయ్య విమర్శలు చేయడం సిగ్గుచేటు’

జఫర్‌గఢ్: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య తదితరులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజయ్య విమర్శలు చేయడం మానుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్ రావు, పార్టీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

పాలకుర్తిటౌన్: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ మండల నాయకుడు ఎడవెల్లి సోంమల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇటీవల గాదెపాక ఎల్లయ్య మృతిచెందగా బుధవారం సోంమల్లయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: పంట పొలాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23, 24 తేదీల్లో చేపట్టనున్న సీపీఐ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉప్పుగల్లు, తమ్మడపల్లి (జి) గ్రామాల్లో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను బుధవారం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ యాకూబ్‌పాషా, పెండ్యాల సమ్మయ్య, నాయకులు రడపాక సత్యం, మంద బుచ్చయ్య, కూరపాటి చంద్రమౌళి, అన్నెపు అజయ్, నక్క రాజేంద్రం, ఎర్రం మధు, గడ్డం రాజు, పద్మ, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నర్మెట: ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అమ్మాపురంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుండెగోని మహిపాల్ (35) హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మూడు పెళ్లిల్లు జరిగినా ప్రవర్తన సరిగా లేకపోవడంతో భార్యలు వదిలేసి వెళ్లిపోయారు. మద్యానికి బానిసైన మహిపాల్ నాలుగు రోజులక్రితం గ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో ప్రతి రోజు మద్యంతాగి వచ్చి తల్లితండ్రులతో గొడవ పడుతూ బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

పాలకుర్తిటౌన్: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామ శివారు జానకీపురానికి చెందిన గడ్డం యాకయ్య(55) గూడూరులో ఓ శుభ కార్యానికి హాజరై తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

దేవరుప్పుల: పెద్దమడూరులో గీతకార్మికుడు నాయకపు అంజయ్య ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న అంబులెన్స్ ఈఎంటీ బిల్లా రాజిరెడ్డి, పైలట్ టి.నరేష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి జనగామ ఏరియా ఆస్పత్రిలో చేర్పడంతో అంజయ్యకు ప్రాణాపాయం తప్పింది. మెరుగైన వైద్యం కోసం ఆయనను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

గంజాయి నిందితుల రిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు కొత్తపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గంజాయితో పట్టుబడిన గుమ్ముల పవన్‌కుమార్, పండుగ తిరుపతిలను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జి.వేణు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాటికొండ గ్రామానికి చెందిన పవన్‌కుమార్, తిరుపతి మంగళవారం మధ్యాహ్నం పల్సర్‌బైక్‌పై స్టేషన్‌ఘన్‌పూర్‌కు వస్తుండగా పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా వారి బైక్‌లో 110 గ్రాముల గంజాయి లభించిందని తెలిపారు. దాంతో బైక్‌ను స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కాపర్ వైరు చోరీ

బచ్చన్నపేట: ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరు చోరీకి గురైన సంఘటన మంగళవారం రాత్రి చిన్నరామన్‌చర్ల గ్రామంలో జరిగింది. బాధిత రైతు పుర్మ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట నుంచి చిన్నరామన్‌చర్ల గ్రామానికి వెళ్లే దారిలో ఎస్‌ఎస్–17లో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో నెల రోజుల క్రితం కాపర్ వైరు చోరీకి గురవడంతో చేతికి వచ్చిన పంటలు ఎండిపోయాయి. దాని స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో ఎస్‌ఈ బిగించారు. మళ్లీ కాపర్ వైరు చోరీకి గురవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున అధికారులు మరో ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

పాలకుర్తిటౌన్: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని చిల్పూరు మండలం దేశాయి తండాకు చెందిన భూక్య సుమన్ ఈజీ మనీకి అలవాటుపడి హైదరాబాద్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల నుంచి తక్కువ ధరకు గుట్కా ప్యాకెట్ల తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నాడు. బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ రూ.21 వేలు ఉంటుందని తెలిపారు. గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు నింధితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.